www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
సోమవారం | 10-6-2024
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | విజయవాడ సిటీ**



దుర్గమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

2లో..

- మొక్కులు తీర్చుకున్న ప్రముఖులు
- ఆశీస్సులు అందుకున్న మాజీ మంత్రులు, హైకోర్టు న్యాయమూర్తి



దుక్కి దున్ని సిద్ధం చేసిన ఉన్న పొలం

జిల్లాలో ఎన్నికల ప్రక్రియ దాదాపు ముగిసింది. జిల్లా యంత్రాంగం ఎన్నికల విధుల్లో నుంచి ఇప్పుడిప్పుడే బయటపడుతోంది. నూతన ప్రభుత్వం మరో రెండు రోజుల్లో కొలువు దీరనుంది. మరోపక్క, ఖరీఫ్ సీజన్ ప్రారంభమై పది రోజులైంది. అధికారులు ఎన్నికల హడావిడిలో ఉండటంతో కృష్ణాడెల్టాకు సాగునీటిని విడుదల చేసే అంశంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. కొత్త ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్నారు. దుక్కులు దున్నుతున్నారు. నారుమడులను సిద్ధం చేసుకుంటున్నారు. నారుమడులు పోసుకునేందుకు పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా అయినా నీటిని కృష్ణాడెల్టాకు విడుదల చేసే అంశంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందనే ఆశతో రైతులు ఉన్నారు.

ఆశల పల్లకిలో..

నూతన ప్రభుత్వంలో సాగుపై అన్నదాతల ఆశ

- సీఎం ప్రమాణస్వీకారం తరువాత ఐఏబీ సమావేశం
- సకాలంలో నారుమడుల కోసం పట్టిసీమ నీటిని విడుదల చేయాలంటున్న అన్నదాతలు
- ఈ ఏడాది పంట రుణాల లక్ష్యం రూ.6,328 కోట్లు
- 70 వేల మంది కౌలురైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని లక్ష్యం

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 1,72,435 హెక్టార్లలో వివిధ రకాల పంటలసాగు జరుగుతుందని వ్యవసాయశాఖ అంచనా వేసింది. ఎన్నికల ప్రక్రియలో భాగంగా నూతన ప్రభుత్వం ఏర్పడటానికి కొంత సమయం తీసుకోవడంతో కృష్ణాడెల్టాకు సాగునీటి విడుదలపై స్పష్టమైన తేదీని ప్రకటించడానికి అవకాశం లేకుండా పోయింది. ఖరీఫ్ సీజన్ ప్రణాళికను ప్రకటించిన వ్యవసాయశాఖ అధికారులు రైతులకు సబ్సిడీపై ఇచ్చే వరి విత్తనాలు, పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలను సద్ధం చేశారు. ఆర్‌బీకేల నుంచి వచ్చిన ఇండెంట్‌ను బట్టి రైతులకు విత్తనాలు ఇస్తామని చెబుతున్నారు. కంకిపాడు, ఉయ్యూరు, పామర్రు, తోట్లవల్లూరు, చల్లపల్లి, మొవ్వ తదితర ప్రాంతాల్లో నారుమడులను రైతులు సిద్ధం చేసి ఉంచారు. వేడిగాలుల ప్రభావం తగ్గి వాతావరణం వ్యవసాయానికి అనుకూలంగా మారిన తరువాత, కాలువలకు సాగునీటి విడుదలపై స్పష్టమైన ప్రకటన వెలువడితే నారుమడుల్లో విత్తనాలు చల్లేందుకు రైతులు సర్వం సిద్ధం చేసి ఉంచారు.

వెదజల్లే పద్ధతిపై రైతుల ఆసక్తి

వ్యవసాయంలో ఖర్చులు తగ్గించుకునే ప్రయత్నంలో భాగంగా జిల్లాలో రైతులు వరిసాగులో వెదజల్లే పద్ధతిని అవలంబించేందుకు ప్రాధాన్యతిస్తున్నారు. గతేడాది వెదజల్లే పద్ధతి ద్వారా 70 వేల ఎకరాల్లో వరినాట్లు వేశారు. ఈ పద్ధతిన వేసిన వరినాట్లు జూన్, జూలై నెలల్లో కురిసిన భారీ వర్షాలకు పది నుంచి పదిహేను రోజుల వయసున్న వరిపైరు వారం రోజులకుపైగా నీటమునిగి చనిపోయింది. దీంతో రైతులు మళ్లీ నారుమడులు పోసి, లేదా వేరే ప్రాంతం నుంచి వరినారు కొనుగోలుచేసి నాట్లు వేయాల్సి వచ్చింది. కాలువల ద్వారా నీటిని విడుదల చేస్తే వెదజల్లే పద్ధతిలో నాట్లు వేసేందుకు రైతులు ఎదురు చూస్తున్నారు.

పట్టిసీమ నీరే దిక్కు

ఈ ఏడాది జూన్‌లో ఆశించిన స్థాయిలో ఇంకా వర్షపాతం నమోదు కాలేదు. రానున్న రెండు నెలల్లో వర్షపాతం అధికంగా నమోదైతే ప్రకాశం బ్యారేజీకి ఎగువన ఉన్న పులిచింతల, నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల్లోకి నీరు చేరే అవకాశం ఉంది. ఈలోగా కృష్ణాడెల్టాలోని భూముల్లో నారుమడులు పోసుకునేందుకు గోదావరి జలాలను పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా ప్రకాశం బ్యారేజీకి పంపింగ్ చేయాల్సి ఉంది. పట్టిసీమ ప్రాజెక్టు వద్ద గోదావరి నదిలో 14 అడుగుల మేర నీరు ప్రవహిస్తుంటే అక్కడి నుంచి నీటిని 24 మోటార్ల ద్వారా పంపింగ్ చేసేందుకు అవకాశం ఉంటుందని జిల్లా నీటిపారుదలశాఖ అధికారులు చెబుతున్నారు. పట్టిసీమ ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయడంతోపాటు, జూన్, జూలై నెలల్లో కురిసే వర్షపాతంతో నారుమడులు పోసేందుకు, వాటిని బతికించుకునేందుకు కొంతమేర అవకాశం ఉంటుందని రైతులు అంటున్నారు. నూతన ప్రభుత్వం ఏర్పడిన వారంలోపు ఐఏబీ సమావేశం నిర్వహించి కృష్ణాడెల్టాకు సాగునీటి విడుదలపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని నీటిపారుదలశాఖ అధికారులు సూచనప్రాయంగా చెబుతున్నారు.

• రూ.6,328 కోట్ల మేర పంట రుణాలు

జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పంటరుణాలుగా రైతులకు రూ.6,328 కోట్లు ఇవ్వాలని ప్రణాళిక రూపొందించారు. ఇందులో ఖరీఫ్ సీజన్, రబీ సీజన్‌లకు విడివిడిగా ఎంతమేర పంట రుణాలు ఇవ్వాలనే అంశంపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు. ఈ అంశంపైనా త్వరలో ప్రభుత్వం స్పష్టత ఇస్తుందని బ్యాంకు అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది 70 వేల మంది కౌలురైతులకు గుర్తింపుకార్డులు ఇవ్వాలని వ్యవసాయశాఖ అధికారులు నిర్ణయించారు. ఖరీఫ్, రబీ సీజన్‌లలో ఇచ్చే పంట రుణాల మొత్తంలో కౌలురైతులకు 10 శాతం మేర పంటరుణాలుగా అందించాలని నిర్ణయించారు.

• కాలువలకు కనీస మరమ్మతులు అవసరం

నాలుగు సంవత్సలుగా వైసీపీ ప్రభుత్వం కాలువల ఆధునీకరణ పనులను పక్కనపెట్టింది. కాలువల మరమ్మతుల (ఓఅండ్‌ఎం) పనులకు సంబంధించి ఈ ఏడాది సుమారుగా రూ.25 కోట్లతో నీటిపారుదలశాఖ అంచనాలు రూపొందించారు. ఈ పనులకు నూతనంగా ఏర్పడే టీడీపీ ప్రభుత్వం ఆమోదం తెలపాల్సి ఉంది. ఈ ఏడాది మే, జూన్ నెలల్లో కురిసిన కొద్దిపాటి వర్షాలకు ప్రధాన పంటకాలువలు, ప్రధాన డ్రెయిన్‌లలో తూడు, గుర్రపుడెక్క, నాచు పేరుకుపోయాయి. కాలువలకు నీటిని విడుదల చేసేముందే వీటి నిర్మూలనకు నిధులు విడుదల చేసి, యుద్ధప్రాతిపదికన పనులు చేయించాల్సి ఉంది.

• నెలలో రెండు విడతల్లో వ్యవసాయంపై సమీక్ష

జిల్లాలో ఖరీఫ్ సీజన్ ప్రణాళిక అమలుపై కలెక్టర్ డీకే బాలాజీ వ్యవసాయశాఖ అధికారులతో గతనెలలో సమీక్ష నిర్వహించారు. వివిధ శాఖల నుంచి ఆయన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయిన తరువాత నెలలో రెండు విడతలుగా వ్యవసాయ, అనుబంధశాఖలపై తాను సమీక్ష చేస్తానని చెప్పారు. రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులను గత నెలలోనే ఆదేశించారు.



వేగంగా సభ ఏర్పాట్లు

చకచకా..

చంద్రబాబు ప్రమాణస్వీకారం సభ ఏర్పాట్లు వేగవంతం

గన్నవరం : ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణాస్వీకారం ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. గన్నవరం మండలం కేసరపల్లి మేధా టవర్స్ ప్రక్కన జరిగే పనులను టీడీపీ నేతలు, అధికారులు పర్యవేక్షిస్తున్నారు. జర్మన్ హ్యాంగర్స్‌తో భారీఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. 80 అడుగుల వెడల్పు, 60 అడుగుల పొడవు, 8 అడుగుల ఎత్తుతో స్టేజీని సిద్ధం చేస్తున్నారు. స్టేజీ పనులను తిరుపతి జేసీ ధ్యాన్‌చందర్, వైజాగ్ వీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ పర్యవేక్షిస్తున్నారు. 800 అడుగుల పొడవు, 420 వెడల్పు గల జర్మన్ హ్యాంగర్స్‌తో భారీ టెంట్‌ను వేస్తున్నారు. ఆదివారం టీడీపీ నేత అచ్చెన్నాయుడు, సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్, డీజీపీ హరీష్‌కుమార్ గుప్త, ప్రత్యేకాధికారులు ప్రద్యుమ్న, బాబు.ఎ, వీర పాండ్యన్, వ్యవసాయ శాఖ కమీషనర్ హరికిరణ్, రాష్ట్ర అదనపు డీజీపీ బాగ్చీ, ఐజీలు రాజశేఖర్‌బాబు, అశోక్ కుమార్, ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, సీపీ రామకృష్ణ, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పరిశీలించారు.

అధికారులకు సీఎస్ సూచనలు

డీజీపీ హరీష్‌కుమార్ గుప్తాతో కలిసి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ గన్నవరం మండలం కేసరపల్లి మేధా టవర్స్ పక్కన జరుగుతున్న ప్రమాణాస్వీకార ఏర్పాట్లను ఆదివారం పరిశీలించారు. సంబంధిత అధికారులకు సీఎస్ సూచనలు చేశారు. ప్రధాని మోదీతో పాటు పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు, శాసన సభ్యులు, ఇతర ప్రజా ప్రతినిధులు వస్తారని, అందుకు తగిన ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు గన్నవరం జాతీయ రహదారి పక్కనే, వెటర్నరీ కళాశాల, సావరగూడెం రోడ్డు ఎలిట్ విస్టాస్, మేధా టవర్స్, ఇతర లేఅవుట్‌లో ఎంపిక చేసిన పార్కింగ్ ప్రాంతాలను పరిశీలించారు. ఎలిట్ విస్టాస్‌లో ఎమ్మెల్యేలు, ఎంపీలు, న్యాయమూర్తులు, తదితర ప్రముఖులకు పార్కింగ్ స్థలాన్ని ఎంపిక చేశారు. ప్రధాన మంత్రి, ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు ప్రధాన సభా వేదిక వద్దకు చేరుకునేందుకు వీలుగా ప్రత్యేకంగా బారికేడ్లు ఏర్పాటు చేయాలని సూచన చేశారు.

చకచకా.. అమరావతి

- రాజధాని ప్రాంతంలో సీఎస్ నీరబ్ కుమార్ సుడిగాలి పర్యటన
- 12న కొలువుదీరనున్న కొత్త ప్రభుత్వం.. శరవేగంగా పనుల నిర్వహణ

కృష్ణలంక, జూన్ 9 : అమరావతి రాజధాని ప్రాంతంలో ఆదివారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ సీఆర్‌డీఏ అధికారులతో కలిసి సుడిగాలి పర్యటన చేశారు. ఈనెల 12న కొత్త ప్రభుత్వం కొలువుదీరనున్న నేపథ్యంలో సీఎస్ పర్యటన ప్రాధాన్యత సంతరించుకొంది. గత చంద్రబాబు ప్రభుత్వం అమరావతి రాజధానిని అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టగా గత ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత ఐదేళ్లుగా రాజధాని ప్రాంతంలో నిర్మాణ పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ప్రస్తుతం ఆ పనులన్నీ శరవేగంగా పునఃప్రారంభం అయ్యేందుకు అవకాశం వున్నందున సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్ చార్జి తీసుకొన్న రెండు రోజుల్లోనే రాజధాని ప్రాంతంలో పర్యటించడం ప్రాధాన్యత సంతరించుకొంది. అమరావతి రాజధాని నిర్మాణాన్ని వేగవంతం చేసేందుకు ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకొంటోంది. ఇప్పటికే గత నాలుగైదు రోజులుగా రాజధాని ప్రాంతంలో 83 జేసీబీలు, టిప్పర్లు వంటి యంత్రాలతో రాజధాని శంకుస్థాపన ప్రాంతంలోను, సీడ్ యాక్సిస్ రహదారి, కరకట్ట రహదారి సహా ఇతర మాస్టర్ ప్లాన్‌లోని ప్రధాన రహదారులు వెంబడి చిన్న చిన్న మరమ్మతులు నిర్వహించడం, తుప్పలు తొలగించడం, విద్యుత్ దీపాల పునరుద్ధరణ వంటి పనులను సీఆర్‌డీఏ అధికారులు చేపట్టారు.

ఈనెల 12న నూతన ప్రభుత్వం కొలువుతీరిన వెంటనే అమరావతి రాజధాని నిర్మాణాన్ని శరవేగంగా ముందుకు తీసుకెళ్లేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను అమలు చేయనున్న నేపథ్యంలో సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ పర్యటన నిర్వహించారు.


రాజధాని ప్రాంతంలో నిర్మాణ పనులను, ప్లాన్‌ను సీఆర్‌డీఏ అధికారులతో కలిసి పరిశీలిస్తున్న సీఎస్

గతంలో 2015లో అమరావతి రాజధానికి శంకుస్థాపన జరిగిన సమయంలో ప్రస్తుత సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ రాష్ట్ర మున్సిపల్ పరిపాలన మరియు పట్టణాభివృద్ధి శాఖ కమిషనర్‌గా వుండటంతో ఆయనకు రాజధాని నిర్మాణానికి సంబంధించిన పనులపై పూర్తి అవగాహన వుంది.

సీఎస్ పర్యటనలో భాగంగా రాజధాని ప్రాంతంలో అసంపూర్తి నిర్మాణ పనులతో మధ్యలో ఆగిపోయిన వివిధ భవన నిర్మాణాలను పరిశీలించారు. ముందుగా రాజధాని ప్రాంతానికి సంబంధించి గతంలో భూమి పూజ జరిగిన ఉద్దండరాయుని పాలెంలోని సీఆర్‌డీఏ ప్రాజెక్టు స్థలాన్ని సందర్శించారు. తదుపరి అఖిల భారత సర్వీసు అధికారుల నివాసం సముదాయ భవనాలను, ఎమ్మెల్యే క్వార్టర్లు, ఏపీ ఎన్జీవో ఉద్యోగుల నివాస భవన సముదాయాలను సీఎస్ పరిశీలించారు. అలాగే 10 ఎంఎల్డి వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్, హేపీ నెస్ట్ వంటి నిర్మాణాలను పరిశీలించారు.

అదేవిధంగా ఇప్పటికే కార్యకలాపాలు నిర్వహిస్తున్న హైకోర్టు అదనపు భవన సముదాయాన్ని కూడా సీఎస్ పరిశీలించారు.

అనంతరం నూతన ప్రభుత్వం కొలువుతీరిన వెంటనే అమరావతి రాజధాని ప్రాంతంలో పనులను శరవేగంగా ఏ విధంగా ముందుకు తీసుకెళ్లాలనే దానిపై సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ సీఆర్‌డీఏ అధికారులతో చర్చించారు. ఈ పర్యటనలో సీఎస్‌తో పాటు సీఆర్‌డీఏ కమిషనర్ వివేక్ యాదవ్, అదనపు కమిషనర్, ఎస్ఈ ఇతర ఇంజినీరింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

రాజధాని ప్రాంతాలను పరిశీలిస్తున్న సీఎస్






రాజధాని శంకుస్థాపన జరిగిన సమయంలో ప్రధాని మోదీ, అప్పటి సీఎం చంద్రబాబుకు వివరాలు తెలియజేస్తున్న నీరబ్‌కుమార్ ప్రసాద్ (ఫైల్)

ఇంద్రకీలాద్రికి పోటెత్తిన భక్తులు



వన్‌టౌన్, జూన్ 9 : ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను భక్తులు ఆదివారం విశేషంగా దర్శించుకున్నారు. వేకువజామునుంచే అమ్మవారిని దర్శించుకునడానికి భక్తులు తరలివచ్చారు. వివిధ ప్రాంతాలనుంచి తరలి వచ్చిన భక్తులు వివిధ అర్జిత సేవల్లో పాల్గొన్నారు. దుర్గమ్మను దర్శించుకున్న దేవదాయకమిషనర్ సత్యనారాయణ స్వయంగా భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు.

దుర్గమ్మను దర్శించుకున్న ప్రముఖులు..

కనకదుర్గమ్మను రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి గోపాలకృష్ణారావు కుటుంబసభ్యులు కలిసి దర్శించుకున్నారు. ఈవో రామారావు ఆలయ మర్యాదలు కల్పించగా.. అమ్మవారి దర్శనం అనంతరం ప్రసాదం, శేషవస్త్రం, ఆశీస్సులు అందచేశారు.


దుర్గమ్మ సేవలో హైకోర్టు న్యాయమూర్తి గోపాలకృష్ణారావు

మాజీమంత్రులు నిమ్మకాయల చిన రాజప్ప, యనమల రామకృష్ణుడు, మండలి బుద్ధప్రసాద్ తదితరులు దర్శించుకున్నారు. వీరిలో చిన్నరాజప్ప, మండలి బుద్ధ ప్రసాద్‌లు తాజాగా ఎమ్మెల్యేలుగా గెలిచారు. అధికారులు వారికి ఆలయ మర్యాదలు అందజేశారు. వీరికి టీడీపీ బీసీ, మైనార్టీ నాయకుడు నాగుల్‌మీరా, కాండ్రేగుల రవీంద్రలు స్వాగతం పలికారు.

ఆదివారం దుర్గమ్మ దర్శనార్థం వచ్చిన నూతన దంపతులకు అమ్మవారి కుంకుమ ప్రసాదం, ఆశీస్సులు అందజేశారు. ఆలయంలో అన్నవితరణకు విజయవాడ కానూరుకు చెందిన చిట్టూరి యఘ్నేశ్వర నారాయణ గుప్త, ఆయన కుటుంబసభ్యులు రూ. 1,01,116 విరాళం అధికారులకు చెక్కు రూపంలో అందజేశారు.

దుర్గమ్మ ఆదాయం రూ.51.03 లక్షలు

దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం ఊహించని విధంగా భక్తుల రాకతో ఆదాయం వృద్ధి చెందింది. దేవస్థానం విడుదల చేసిన ప్రకటన మేరకు రాత్రి 8.30 గంటల వరకు వివిధ దర్శన రుసుం టికెట్‌ల ద్వారా రూ.51,03,032మేరకు ఆదాయం లభించింది. రూ.500 దర్శనం టికెట్ ద్వారా రూ.28,52,600లు, రూ.300 టికెట్ ద్వారా రూ.13,37,000లు, రూ.100 టికెట్ ద్వారా రూ.8,93,800లు ఆదాయం చేకూరింది. 4,601 మంది కేశఖండన శాలలో తమ తలనీలాలను సమర్పించారు. 68,487 లడ్డూ ప్రసాదాలను, 33,345 పులిహోర ప్రసాదం ప్యాకెట్‌లను విక్రయించారు. రూ.3,02,757 విరాళాల ద్వారా సమకూరింది.



దుర్గగుడికి వీరమహిళలు, నేతల పాదయాత్ర

వన్‌టౌన్ : జనసేనాధిపతి పవన్‌కల్యాణ్ పిఠాపురంలో భారీ విజయం సాధించినందుకు జనసేన వీరమహిళలు, నాయకులు ఆదివారం మంగళగిరి జనసేన కార్యాలయం నుంచి విజయవాడ దుర్గగుడి వరకు పాదయాత్ర నిర్వహించి మొక్కును తీర్చుకున్నారు. తాడేపల్లి మండల జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి వీరంతా పాదయాత్ర నిర్వహించారు. జనసేన నాయకులు చిల్లపల్లి శ్రీనివాసరావు జెండా ఊపి పాదయాత్రను ప్రారంభించారు. దుర్గగుడిలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు.



భక్తులతో కిటకిటలాడిన సుబ్బారాయుడి ఆలయం

మోపిదేవి : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు స్వామివారి దర్శనం కోసం బారులు తీరారు. నాగపుట్టలో పాలుపోసి స్వామివారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలోని నాగవల్లి వృక్షం వద్ద ముడుపులు కట్టి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ సహాయక ఉద్యోగులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మోకాళ్లపై తిరుమల వెంకన్నకు మొక్కు చెల్లింపు

ఘంటసాల: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రావాలని ఘంటసాల మండలం పాపవినాశనం గ్రామానికి చెందిన టీడీపీ నేతలు మొక్కుకున్నారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో టీడీపీ నాయకులు బోయిన మణి, కుంపటి చిట్టిబాబు, సుంకర వినయ్ కుమార్‌లు ఆదివారం తిరుమల వెళ్లి మోకాళ్లపై మెట్లెక్కి మొక్కు తీర్చుకున్నారు.



నేడు సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ప్రతినిధుల అభినందన సభ

విజయవాడ కల్చరల్, జూన్ 9 : ప్రజాస్వామ్య ప్రక్రియలో జాతీయంగా జరిగే ప్రత్యక్ష ఎన్నికలలో ప్రజలు తమ ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించడంలో చేసిన కృషికి కారణంగా సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంస్థ ప్రతినిధులను ఈనెల 10వ తేదీ సోమవారం సిద్ధార్థ ఆడిటోరియంలో సత్కరించనున్నట్టు జి.ఆర్.కె.పోలవరపు సాంస్కృతిక సమితి నిర్వాహకులు గోళ్ల నారాయణరావు తెలిపారు. సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంస్థ అధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో ప్రధాన నగరాలు, పట్టణాలలో ఓటు వినియోగంపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేయడమే ప్రధాన లక్ష్యంగా సాగిందన్నారు. ఏడాది నుంచి ప్రధానంగా యువ ఓటర్లను చైతన్య పరచడంలో జరిపిన కృషి ఎంతో అభినందనీయమన్నారు. మాజీ న్యాయమూర్తులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో పనిచేసిన విశ్రాంత ఉన్నతాధికారులు, ప్రజాసేవ కాంక్ష కలిగిన వివిధ వర్గాలకు చెందిన వారితో ఏర్పాటు చేసిన సిటిజెన్స్ ఫర్ డెమోక్రసీ సంస్థ బృందానికి సోమవారం సాయంత్రం 4 గంటలకు సిద్ధార్థ ఆడిటోరియంలో ఆత్మీయ అభినందన సమావేశం ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. సమావేశంలో ఇటీవల జరిగిన ఎన్నికల తీరు తెన్నులు-సరళిపై ఏపీ ఎలక్షన్ వాచ్ కన్వీనర్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్ ప్రసంగిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని పేర్కొన్నారు.

జేఈఈ ప్రవేశ పరీక్షలో శారద విద్యార్థుల ప్రతిభ

మొగల్రాజపురం : జేఈఈ అడ్వాన్స్‌డ్ 2024 ప్రవేశ పరిక్ష ఫలితాలలో జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించిన సీనియర్ ఎంపీసీ విద్యార్థులను ఆదివారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో మొగల్రాజపురం శారద విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ వై.రమేష్ బాబు, ఎండీ వై.శారదా దేవి అభినందించారు. ఎ.సంపత్ (729), కె.నాగ రాహుల్ ధ్రువ (3670), యం.నాగలక్ష్మీదేవి (536), పి.పవిత్ర (5544), పి.వెంకట ఫణికుమార్ (7689) తదితరులు మంచి ర్యాంకులు సాధించారని చెప్పారు. సీటు వచ్చే విధంగా విద్యార్థులు మార్కులు సాధించడం అభినందనీమన్నారు. పరిమితమైన విద్యార్థులతో మంచి ర్యాంకులు సాధించడం సంతోషంగా ఉందన్నారు. వత్తిడి లేని విద్య, క్రమశిక్షణ, అధ్యాపకులు సలహాలు, సూచనలు ప్రశాంత వాతావరణం, ఆన్‌లైన్ పరిక్షా ప్రణాళిక, విద్యార్థుల శ్రద్ధ, తల్లిదండ్రుల సహకారం కారణమని కళాశాలల అడ్వైజర్ ఈఎస్ఆర్‌కే ప్రసాద్, జీఎం జీవీ రావు చెప్పారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.


ఎ.సంపత్ 729 | కె.నాగరాహుల్‌ధ్రువ 3670 | యమ్. లలితాదేవి 5366 | పి.పవిత్ర 5544 | పి.వి ఫణికుమార్ 7689

పోలవరం, అమరావతి నిర్మాణమే ప్రథమ లక్ష్యం

- కేశినేని శివనాథ్(చిన్ని)

వన్‌టౌన్, జూన్ 9 : పోలవరం, రాజధాని అమరావతి నిర్మాణం పూర్తి చేయడమే తమ ముందున్న ప్రథమ లక్ష్యమని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ప్రధానమంత్రిగా మోదీ ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఆంధ్రప్రజల కలల రాజధాని అమరావతి నిర్మాణం త్వరగా పూర్తి చేసేందుకు కృషి చేస్తామన్నారు. రాజధాని అమరావతి, పోలవరం నిర్మాణం, కేంద్రంలో టీడీపీకి లభించిన ప్రాధాన్యత, గన్నవరంలో చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకార ఏర్పాట్లు తదితరాలపై ఆయన స్పందించారు. చంద్రబాబు సీఎంగా ప్రమాణ స్వీకారం చేస్తున్న కార్యక్రమానికి భారీ ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. కేంద్ర క్యాబినెట్‌లో ఇద్దరు ఎంపీలకు అవకాశం కల్పించినందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ధన్యవాదాలు చెబుతున్నామన్నారు. రాష్ట్రాభివృద్ధికి ఎంపీలందరూ సమన్వయంతో పనిచేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఆంధ్రప్రజల కలల రాజధాని అమరావతి నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసేందుకు కృషిచేస్తామన్నారు. ఇందుకు కేంద్రంలోని ఏఏ శాఖల నుంచి నిధులు రావాలో తెలుసుకుని వాటిని సాధించేందుకు తమ ప్రయత్నాలు కొనసాగుతాయన్నారు. పోలవరం, అమరావతి రాజధాని నిర్మాణం పూర్తి చేయడమే తమ ముందున్న ప్రథమ లక్ష్యమన్నారు. జగన్‌పై ప్రజలు ఓట్ల రూపంల తిరుగుబాటు చేసారని వ్యాఖ్యానించారు.


పార్లమెంట్ భవన్‌లో చంద్రబాబునాయుడితో కేశినేని శివనాథ్(చిన్ని)

చంద్రబాబును కలిసిన కేశినేని శివనాథ్

భారత ప్రధానిగా నరేంద్రమోదీ ప్రమాణస్వీకార మహోత్సవం ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ఆదివారం జరిగింది. మోదీ ప్రమాణస్వీకార కార్యక్రమం అనంతరం పార్లమెంట్ భవన్‌లో కేంద్రమంత్రి కింజరపు రామ్మోహన్‌నాయుడు, గుంటూరు ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్, అమలాపురం ఎంపీ జీఎం హరీష్ బాలయోగి, వైశాఖ ఎంపీ శ్రీభరత్‌తో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ మర్యాదపూర్వకంగా టీడీపీ అధినేత చంద్రబాబునాయుడును కలిసారు.

ప్రత్యేక హోదా తెచ్చేందుకు ఎంపీలు కృషి చేయాలి

- కొనకళ్ల నారాయణ

మచిలీపట్నం టౌన్, జూన్ 9 : ఆంధ్రప్రదేశ్ నుంచి ఎంపికైన ముగ్గురు ఎంపీలు రాష్ట్రానికి ప్రత్యేక హోదా తెచ్చేందుకు కృషి చేయాలని మాజీ ఎంపీ, కృష్ణాజిల్లా టీడీపీ అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ అన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్ర మంత్రి వర్గంలో కింజారపు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, శ్రీనివాసవర్మకు చోటు దొరకడం ముదావహమన్నారు. కింజారపు రామ్మోహన్‌నాయుడు మూడు పర్యాయాలు శ్రీకాకుళం నుంచి ఎంపీగా గెలుపొంది ఆ ప్రాంత అభివృద్ధికి కృషి చేశారన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు రైల్వేజోన్ తీసుకురావడంతో పాటు విభజన హామీలు తీసుకువచ్చేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కార్యాలయ కార్యదర్శి బత్తిన దాసు తదితరులు పాల్గొన్నారు.

జగ్గయ్య పేట చరిత్రను తిరగరాసిన తాతయ్య

- మూడోసారి గెలిచి ఎమ్మెల్యేగా రికార్డు



జగ్గయ్యపేట, జూన్ 8 : జగ్గయ్యపేట అసెంబ్లీ నియోజకవర్గ చరిత్రలో ఒకసారి వద్దని ఓటరు తీర్పు చెప్పాక మళ్లీ ఆ అభ్యర్థి గెలిచిన దాఖలాలు లేవు.. గత 2019 ఎన్నికలలో ఆ రికార్డును చేరిపేసిన సామినేని ఉదయభాను సరసన శ్రీరాం తాతయ్య కూడా చేరారు. అప్పటి వరకు ఓటమి ఎరుగని శ్రీరాం తాతయ్య 2019 ఎన్నికల్లో అనూహ్యంగా ఓటమి చవి చూశారు. ఒకసారి ఓడిపోయిన వారిని తిరిగి అందలం ఎక్కించని పేట ఓటర్లు 2024లో సిట్టింగ్ ఎమ్మెల్యే ఉదయభానును కాదని తాతయ్యకే మూడోసారి పట్టం కట్టారు. ఎమ్మెల్యేగా అత్యధిక మెజార్టీతో విజయం సాధించిన శ్రీరాం తాతయ్య అరుదైన రికార్డు సొంతం చేసుకున్నారు.

చరిత్రను పరిశీలిస్తే.. 1951లో జగ్గయ్యపేట నియోజకవర్గం ఏర్పడింది. తొలి ఎమ్మెల్యేగా పిల్లలమర్రి వెంకటేశ్వర్లు ఎన్నిక కాగా 1957లో పునర్విభజనతో కనుమరుగైన నియోజకవర్గం 1962లో మళ్లీ పునరుద్ధరించబడి ఎస్టీకి రిజర్వ్‌గా కాగా గాలేటి వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. 1967లో జనరల్ కాబడిన నియోజక వర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి, స్వాతంత్ర సమరయోధుడు రేపాల బుచ్చిరామయ్య శ్రేష్టి విజయం సాధించారు. 1972లో ఆయన కాంగ్రెస్ తరఫున పోటీచేయగా ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన ముక్త్యాల రాజా వీఆర్‌జీకే ఎం.ప్రసాద్ విజయం సాధించారు. కొద్దికాలానికే రాజా మృతి చెందటంతో జరిగిన ఉప ఎన్నికలో రాజా సతీమణి, కాంగ్రెస్ నుంచి రేపాల పోటీ చేయగా, మళ్లీ రాజా సతీమణి రాజ్యలక్ష్మమ్మ విజయం సాధించింది. 1978లో కాంగ్రెస్ తరఫున బొద్దులూరి రామారావు విజయం సాధించగా, 1983లో టీడీపీ అభ్యర్థి అక్కినేని లోకేశ్వరరావు చేతిలో పరాజయం పొందారు. ఆ తర్వాత ఆయన రాజకీయ అవకాశాలు దక్కలేదు. 1985లో తెలుగుదేశం అభ్యర్థిగా నెట్టెం రఘురాం పోటీ చేయగా, కాంగ్రెస్ తరఫున ముక్కపాటి వెంకటేశ్వర రావు పోటీ చేసి పరాజయం పొందారు. అదే ముక్కపాటి తిరిగి 1994లో కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన టీడీపీ అభ్యర్థి నెట్టెం రఘురాం విజయం సాధించారు. ముక్కపాటిని ఓడించిన ప్రజలు మళ్లీ పట్టం కట్టలేదు. 1999, 2004లలో టీడీపీ అభ్యర్థిగా నెట్టెం రఘురాం, కాంగ్రెస్ అభ్యర్థి సామినేని ఉదయభానులు పోటీ చేయగా ఉదయభానును విజయం వరించింది. 1999లో మూడుసార్లు వరుసగా విజయం సాధించి హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా నిలిచిన నెట్టెం పరాజయం పొందాక మళ్లీ ప్రజల మద్దతు పొందలేకపోయారు. 2009, 2014లలో టీడీపీ అభ్యర్థిగా శ్రీరాం తాతయ్య బరిలో నిలవగా కాంగ్రెస్ అభ్యర్థిగా, రెండోసారి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన ఉదయభాను రెండుసార్లు పరాజయం పొందారు. 2019లో పాత సెంటిమెంట్‌ను అధిగమించి వైసీపీ అభ్యర్థిగా పోటీచేసిన ఉదయభాను, తెలుగుదేశం అభ్యర్థి శ్రీరాం తాతయ్యను 4778 ఓట్ల తేడాతో ఓడించి చరిత్రను తిరగ రాశారు. అదే బాటలో 2024లో వైసీపీ అభ్యర్థి ఉదయభానుపై మూడోసారి పోటీలో నిలిచిన టీడీపీ అభ్యర్థి శ్రీరాం తాతయ్య 15977 ఓట్ల తేడాతో ఓడించారు. ఒకసారి ఓడిన వారిని జగ్గయ్యపేట ప్రజలు ఆదరించరన్న అపవాదును పొగొట్టి ఉదయభాను సరసన నిలిచారు. జగ్గయ్యపేట నియోజకవర్గంలో మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచిన నెట్టెం రఘురాం, సామినేని ఉదయభానుల సరసన శ్రీరాం తాతయ్య నిలిచారు.

సెంటిమెంట్‌ను బ్రేక్ చేసిన తాతయ్య

జగ్గయ్యపేట చరిత్రలో మునిసిపల్ ఛైర్మన్‌లుగా పనిచేసిన వారికి రాజకీయ భవిష్యత్ మృగ్యం అన్న అపవాదు, సెంటిమెంట్‌ను తాతయ్య తుడిచేశారు. జగ్గయ్యపేట పురపాలక సంఘంగా ఏర్పడినప్పటి నుంచి పనిచేసిన ఛైర్మన్‌లు ఎవరు తర్వాత రాజకీయాల్లో రాణించలేదు. ప్రప్రథమ మునిసిపల్ ఛైర్మన్‌గా ఎన్నికైన శ్రీరాం బదరీనారాయణ తర్వాత వ్యాపారాలపై దృష్టి సారించారు. ఆ తర్వాత మహిళలకు రిజర్వ్ కావటంతో కాంగ్రెస్ తరఫున నూతనంగా రాజకీయాలలోకి వచ్చి విజయం సాధించిన హనుమంతు రత్నకుమారి ఐదేళ్ల తర్వాత రాజకీయాల్లో ఇమడలేకపోయారు. బీసీలకు రిజర్వ్ కావటంతో తర్వాత వ్యాపారవేత్త కొమ్మవరపు వెంకటనారాయణ కాంగ్రెస్ నుంచి ఎన్నికైనా, తర్వాత క్రియాశీలకంగా వ్యవహరించలేక తెరమరుగయ్యారు. ఆ తర్వాత జనరల్‌గా మారిన మునిసిపాలిటికి జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ తరఫున మునిసిపల్ ఛైర్మన్‌గా ఘన విజయం సాధించి నామ మాత్రంగా (టీడీపీ) ప్రతిపక్షాన్ని మిగిల్చిన శ్రీరాం తాతయ్య అనూహ్యంగా 2009 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీలో చేరి ఆ పార్టీ అసెంబ్లీ అభ్యర్థిగా శ్రీరాం తాతయ్య బరిలో నిలిచి కాంగ్రెస్ అభ్యర్థి సామినేని ఉద యభానును 9678 ఓట్ల తేడాతో ఓడించి చరిత్ర సృష్టించారు. మునిసిపల్ ఛైర్మన్ చేసిన వారికి రాజకీయ భవిష్యత్ ఉండదన్న అపప్రదను తొలగించి ఛైర్మన్ నుంచి ఎమ్మెల్యేగా పదోన్నతి సాధించారు. పేట చరిత్రలో ఎమ్మెల్యేగా ఓడి గెలిచిన వారు లేరన్న రికార్డును తుడిపేసి ఉదయభాను సరసన నిలిచిన తాతయ్య, నెట్టెం, ఉదయభానులతో సమానంగా మూడుసార్లు ఎన్నికై తాజా గెలుపుతో రికార్డును సమం చేశారు.


రామోజీ అంత్యక్రియల్లో పాల్గొన్న కొల్లు రవీంద్ర, లోకేశ్

రామోజీరావు అంత్యక్రియలకు కృష్ణాజిల్లా నేతలు

మచిలీపట్నం టౌన్, జూన్ 9 : పద్మభూషణ్, ఈనాడు పత్రిక వ్యవస్థాపకుడు చెరుకూరి రామోజీరావు అంత్యక్రియల్లో ఆదివారం మచిలీపట్నం ఎమ్మెల్యే కొల్లు రవీంద్ర పాల్గొన్నారు. పత్రిక, చలనచిత్ర రంగానికి రామోజీరావు చేసిన సేవలు మరువలేనివన్నారు. రామోజీరావు మృతికి టీడీపీ నాయకులు గొర్రెపాటి గోపీచంద్‌తో పాటు గోపు సత్యనారాయణ, సనకా నాగులు, ఎండీ ఇలియాస్ పాషా, పిప్పళ్ల కాంతారావు, పాత్రికేయులు సంతాపం వ్యక్తం చేశారు.


రామోజీరావు అంతిమయాత్రలో వెనిగండ్ల

తెలుగుజాతికి స్ఫూర్తి : వెనిగండ్ల

గుడివాడ : తెలుగుజాతికి స్ఫూర్తినిచ్చిన వ్యక్తి రామోజీరావు అని, అలాంటి మహనీయుడు మృతి బాధాకరమని ఎమ్మెల్యేగా గెలిచిన వెనిగండ్ల రాము, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావులు అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో రామోజీరావు పార్థివదేహాన్ని సందర్శించి నివాళ్ళులర్పించారు. అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెనిగండ్ల మాట్లాడుతూ, అనునిత్యం సమాజహితం కోసం, తెలుగు జాతి కోసం పనిచేసిన వ్యక్తి రామోజీరావు అని, సాధారణ కుటుంబ నుంచి వచ్చి అసాధారణ వ్యక్తిగా ఎదిగారని కొనియాడారు. మాజీ ఎమ్మెల్యే రావి మాట్లాడుతూ, వ్యక్తిగతంగా రామోజీ కుటుంబంతో తనకు సన్నిహిత సంబంధాలున్నాయన్నారు.

ఆధ్యాత్మికతపై అవగాహన అవసరం

హనుమాన్‌జంక్షన్, జూన్ 9: ప్రజల్లో ఆధ్యాత్మిక చింతనపై అవగాహన కల్పించడం చాలా అవసరమని ప్రవచన కర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. ఆదివారం అభయాంజనేయ స్వామి ఆలయంలో ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమం నిర్వహించడానికి జంక్షన్ వచ్చిన చాగంటి కోటేశ్వరరావు ముందుగా స్థానిక నూజివీడు రోడ్డులోని శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయ ఫౌండర్ ట్రస్టీ కాకాని బాబు అరుణ గృహానికి విచ్చేశారు. వేంకటేశ్వర స్వామి ఆలయంలో నిత్యం పూజా కార్యక్రమాలు, సామూహిక వ్రతాలు నిర్వహించడం అభిలషణీయమని పేర్కొంటూ కాకాని అరుణ బాబును,కుటుంబ సభ్యుల్ని,ఆలయ నిర్వాహకుల్ని అభినందించారు. ఈ సందర్భంగా కాకాని అరుణబాబు వేంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని జ్ఞాపికగా అందజేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పలువురు స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా బెయిలీ బ్రిడ్జి

కూచిపూడి : కాజ గ్రామంలో 12 సంవత్సరాల క్రితం ఐనంపూడి డ్రెయిన్‌పై నిర్మించిన బెయిలీ బ్రిడ్జి ప్రమాదకరస్థితికి చేరింది. వాహనదారులు, ప్రజలు ఈ వంతెనపై ప్రయాణించటానికి భయపడుతున్నారు. కాజ గ్రామంలో ఐనంపూడి డ్రెయిన్‌పై 50 సంవత్సరాల క్రితం నిర్మించిన వంతెన శిథిలమవ్వటంతో తాత్కాలికంగా బెయిలీ బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. తేలికపాటి వాహనాలకు మాత్రమే వంతెనపై అనుమతి ఉంది. మొవ్వ నుంచి జిల్లా కేంద్రం మచిలీపట్నం వెళ్లటానికి ఇది ప్రధాన రహదారి కావటంతో దీనికి అత్యంత ప్రాధాన్యత ఉంది. ప్రస్తుతం బెయిలీ బ్రిడ్జి ప్లాట్‌ఫారం పూర్తిగా శిథిలమవ్వటంతోపాటు తేలికపాటి వాహనాలకే వంతెన ఊగిపోతూ తరచూ ప్రమాదాలు జరుగు తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి శాశ్వత వంతెన నిర్మాణం చేపట్టాల్సిందిగా ప్రజలు కోరుతున్నారు.


ప్రమాదాలు జరుగుతున్నా అధికారులకు పట్టడం లేదు : మాజీ ఎంపీపీ నారాయణరావు

వంతెనపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు స్పందించటం లేదని కాజ గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ తాతా నారాయణరావు వాపోయారు. అనేక పర్యాయాలు అధికారులకు, ప్రజా ప్రతినిధులకు చెప్పినప్పటికీ ఫలితం లేకుండాపోయిందన్నారు. బెయిలీ బ్రిడ్జి నిర్మాణం చేపట్టినప్పుడే రెండు సంవత్సరాల వ్యవధిలో శాశ్వత వంతెన నిర్మాణం చేస్తామని అధికారులు చెప్పి, ఆ దిశ ప్రయత్నాలు చేయలేదన్నారు. ప్రజా అవసరాలు దృష్టిలో ఉంచుకుని శాశ్వత వంతెన నిర్మాణం చేపట్టాల్సిందిగా నారాయణరావుతో పాటు పరిసర గ్రామాల ప్రజలు కోరుతున్నారు.





విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

గన్నవరం, జూన్ 9 : విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించినప్పుడే మంచి భవిష్యత్ ఉంటుందని రిటైర్డ్ హిందీ పండిట్ కంభంపాటి ధర్మారావు అన్నారు. స్థానిక గ్రేడ్-1 గ్రంథాలయంలో విద్యార్థులకు నిర్వహించిన పలు పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్లు, బహుమతులు ఆదివారం అందజేశారు గ్రంథాలయ ఇన్‌చార్జి డి.బాబూరావు, కోటేశ్వరరావు, రవణమ్మ తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు సర్టిఫికెట్లు అందజేసిన ధర్మారావు

బుడమేరులో తూడు, డెక్క మేట!

- పట్టించుకోని ఇరిగేషన్ శాఖ
- సాగునీరందక ఇబ్బంది పడుతున్న దిగువ ప్రాంత రైతులు



ఉంగుటూరులో బుడమేరు వంతెన వద్ద దట్టంగా గుర్రపుడెక్క, తూడుకాడ

ఉంగుటూరు, జూన్ 9 : బుడమేరులో గుర్రపు డెక్క, తూడు దట్టంగా పెరిగి నీటిపారుదలకు అడ్డంకిగా మారింది. బుడమేరుపై తరిగొప్పల, వేంపాడు, ఉంగుటూరు చప్టా వంతెనల వద్ద గుర్రపుడెక్క, తూడు కాడ దట్టంగా మేటవేసి సాగునీటి ప్రవాహాన్ని నిరోధిస్తుండటంతో దిగువ ప్రాంతాలకు సాగునీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. బుడమేరు ఆయకట్టు పరిధిలో తరిగొప్పల, వేంపాడు, ఎలుకపాడు, ఓంద్రంపాడు, ఉంగుటూరు, లంకపల్లి, ముక్కపాడు, ఆముదాపల్లి, కొయ్యగూరపాడు గ్రామాలు న్నాయి. బుడమేరు ఆధునీకరణ పనులవల్ల ఆయా ప్రాంతాలకు ముంపు సమస్య కొంత తొలగినా, గుర్రపు డెక్క, తూడు సమస్య ప్రతిఏటా రైతులను వెంటాడుతోంది. ప్రస్తుతం ఖరీఫ్ (సార్వా) సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులు బోర్లు, చెరువులు, బుడ మేరు ఆధారంగా నారుమళ్లు పోస్తున్నారు. రుతుపవనాల ప్రభావంతో అడపాదడపా కురుస్తున్న వర్షాలకు తోడు, బుడమేరులో నీటిని మోటార్లద్వారా తోడి నారుమళ్లకు నీటితడులు అందిస్తున్నారు. ఈ క్రమంలో ఉంగుటూరు చప్టా వంతెన వద్ద గుర్రపు డెక్క, తూడుకాడ మూడడుగల మందంతో సుమారు 600 మీటర్ల మేర విస్తరించి, కాలువ కన్పించకుండా చాపలా పరుచుకుంది. దీంతో నీటిపారుదలకు ఆటంకం ఏర్పడి కొద్దిమోతాదులో దిగువకు నీరు ప్రవహిస్తోంది. ఆ నీటితో నారుమళ్లను ఎలా కాపాడు కోవాలని శివారు ప్రాంతాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బుడమేరులో మేటవేసుకుపోయిన గుర్రపుడెక్కను తొలగించి సాగునీటికి ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఎమ్మెల్యే వెనిగళ్లకు అభినందన

హనుమాన్‌జంక్షన్, జూన్ 9 : గుడివాడ ఎమ్మెల్యేగా ఎన్నికైన వెనిగళ్ల రామును టీడీపీ బాపులపాడు మండల నాయకులు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు ఆధ్వర్యంలో మండల తెలుగు యువత నాయకులు దయాల రాజీవ్‌కాంత్, జంక్షన్ పట్టణ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి డొప్పల ప్రణీత్, దంటగుంట్ల గ్రామ పార్టీ అధ్యక్షుడు లావేటి వెంకటేశ్వరరావు, వంపుగాని చిన్ని తదితరులు కలిసి రాముకు శుభాకాంక్షలు తెలియజేశారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూన్ 9 : ఆరోగ్యకర సమాజం కోసం పర్యావరణాన్ని పరిరక్షంచడం ప్రతి ఒక్కరి బాధ్యతని రాణా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు సుంకర సాంబశివరాయల్ అన్నారు. పెరికీడులో గొట్టాపు సత్యవతి తన పుట్టినరోజు సందర్భంగా రాణా వేల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రజలకు ఉపయోగపడే విధంగా నిమ్మ, మామిడి మొక్కలను ఆదివారం నాటారు. వర్షాకాలం వస్తుందున ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కనైనా నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పోతల సురేష్, సంపంగి శ్రీనివాసరావు, గొట్టాపు ప్రవీణ్, మజ్జి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్‌ను కలిసిన వెలగపూడి



పెనమలూరు, జూన్ 9 : విజయవాడ చేరుకొన్న టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేశ్‌ను టీడీపీ కృష్ణాజిల్లా ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకరబాబు గన్నవరం విమానాశ్రయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. నిన్నటి సాధారణ ఎన్నికల్లో గెలుపొందిన లోకేశ్‌ను వెలగపూడి సన్మానించారు.

మహనీయుడు ఎన్టీఆర్: యార్లగడ్డ



ఎన్టీఆర్ ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం/ జంక్షన్ రూరల్, జూన్ 9 : తెలుగుజాతిని విశ్వవ్యాప్తం చేసిన మహనీయుడు ఎన్టీఆర్ అని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. హైదరాబాద్‌లో ఎన్టీఆర్‌ఘాట్ వద్ద ఆదివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పేదవారి కోసం పరితపించిన మహనేత ఎన్టీఆర్ అన్నారు. ఆయన అడుగు జాడల్లో అందరం నడవాల్సిన అవసరం ఉందన్నారు. ఎమ్మెల్యేగా చిత్తూరులో గెలిచిన గురజాల జగన్‌మోహన్ కూడా నివాళులర్పించారు.

దుర్గమ్మకు మొక్కు చెల్లింపు



మొక్కులు చెల్లిస్తున్న టీఎన్‌టీయూసీ నేతలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూన్ 9 : గన్నవరం నియోజకవర్గంలో యార్లగడ్డ వెంకట్రావు ఘన విజయం, నారా చంద్రబాబు ముఖ్యమంత్రి కావడంతో టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు బి. పాండురంగారావు మొక్కులు చెల్లించారు. ఉమామహేశ్వరపురానికి చెందిన పాండురంగారావు ఆదివారం విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఈ కార్యక్రమంలో గ్రామ టీడీపీ కార్యదర్శి పూడి శివ, గ్రంధి శ్రీను, నాగిరెడ్డి, అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ధర్మాన్ని కాపాడడం కోసమే హనుమంతుడి అవతారం: చాగంటి

హనుమాన్‌జంక్షన్, జూన్9 : ధర్మాన్ని ఎవరైతే కాపాడుతారో అటువంటి వారిని కాపాడడానికి వచ్చింది హనుమంతుడి అవతారమని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక అభయాంజనేయ స్వామి ఆలయం ఆధ్వర్యంలో చాగంటి కోటేశ్వరరావుచే ఆధ్యాత్మిక భక్తి ప్రవ చన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఆయన అభయాంజనేయ స్వామిని దర్శించుకున్నారు. అనంతరం ప్రసంగిస్తూ ధర్మానికి ఎపుడైనా హాని కలిగినపుడు అటువంటి సమయంలో ధర్మాన్ని రక్షించడం కోసం భగవంతుడు అవతార శ్రీకారం చేస్తుంటాడని, అలాంటి అవతారాల్లో హనుమంతుడి అవతారం చాలా అద్భుతమైనదన్నారు. హనుమంతుడి అవతార విశిష్టత రామాయణం ఉత్తర కాండలో చాలా గొప్పగా వర్ణించారన్నారు. ఎవరు భక్తి కలిగి ఉంటారో, ఎవరు ధర్మాన్ని కాపాడుతుంటారో అటువంటి వారిని హనుమంతుడు ప్రొదవిపట్టి కాపాడుతుంటారన్నారు. ధర్మానికి విరుద్ధంగా ప్రవర్తించేవారిని వాయుపుత్రుడు పరికిస్తు ఉంటాడని, రామో విగ్రహం ధర్మహఃఅనిపేరుందన్నారు. రాముడుంటే రాశీభూతమైన ధర్మమన్నారు. ధర్మం ఉన్న చోట మూర్తీభవించిన ఒక రూపాన్ని పొందితే అదే రాముడున్నారు. అదే హనుమంతుడి అవతారమన్నారు. అటువంటి రాముడికి భక్తులై ఉండడమంటే ధర్మాన్ని అనుష్టించడంతో ప్రీతి కలిగి ఉండటమేనన్నారు. అలాంటి వారిని హనుమంతుడు నిరతంతరం కాపాడుతుంటాడన్నారు. కార్యక్రమాన్ని ఈవో కె.శ్రీనివాస్, ఆలయ ప్రధాన అర్చకులు మారేపల్లి సీతారామానుజాచార్యులు, వెంకట రామశేషాచార్యులు, శ్రీనివాసాచార్యులు పర్యవేక్షించారు.



ప్రవచనం చేస్తున్న చాగంటి కోటేశ్వరరావు

తెలుగువారి ఆత్మబంధువు రామోజీ..

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూన్ 9 : సామాన్య రైతు కుటుంబం నుంచి అనితర సాధ్యమైన సవాళ్లను దీటుగా ఎదుర్కొని తెలుగువారి ఆత్మబంధువుగా వెలుగులు పంచిన మహనీయుడు రామోజీరావు అని తెలుగురైతు రాష్ట్ర కార్యదర్శి వేములపల్లి శ్రీనివాసరావు కొనియాడారు. వేలేరు కూడలిలో రామోజీకి ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. రాతిగుట్టల్లో ప్రపంచమే మెచ్చే విధంగా రామోజీ ఫిల్మ్‌సిటీ నిర్మించడంతో తెలుగువారి ఖ్యాతి దశదిశలా వ్యాప్తి చేసిన ఘనత రామోజీరావుకు దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అవిర్నేని భవానిశంకర్, దోనవల్లి రామారావు, కాజ సురేష్, అంగడాల సీతారామస్వామి, సాంబశివరావు, గోళ్ల శివనాగమల్లేశ్వరరావు, నాగేశ్వరరావు, కార్తీక్ పాల్గొని నివాళులర్పించారు.

బోడెకు అభినందనల వెల్లువ

పెనమలూరు, జూన్ 9 : ఎన్నికల ఫలితాలు వచ్చి ఐదు రోజులైనా పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు అభినందనలు కొనసాగుతూనే ఉన్నాయి. ఉదయం ఏడు గంటల నుంచి ప్రారంభమవుతున్న అభిమానుల తాకిడి రాత్రి పది దాటినా కొనసాగుతూనే ఉంది. ఆదివారం సెలవు దినం కావడంతో ప్రభుత్వ ఉద్యోగులు బోడె ప్రసాద్‌కు అభినందనలు తెలపడానికి వెల్లువెత్తారు. రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ఎస్టీయూ 78వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా కేక్ కట్ చేసి ఆయన ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ కృష్ణాజిల్లా ఉపాధ్యక్షుడు మండవ శ్రీనివాస్, పీకా ఇమ్మానుయేలు, కౌన్సిలర్లు శ్రీనివాసమూర్తి, యుటిటస్ పాల్, పాలడుగు వెంకట కృష్ణమోహన్, అక్కినేని సత్యవంతు, వివిధ మండలాల అధ్యక్షులు పిచ్చేశ్వరరావు, పచ్చిగళ్ల సురేస్‌బాబు, మిత్రా, ఇంటూరి నాగేశ్వరరావు, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

● పెనమలూరు నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు సంగెపు రంగారావు ఆధ్వర్యంలో గోసాల గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌ను అభినందించారు. ఈ సందర్భంగా బోడె ప్రసాద్ మాట్లాడుతూ, గోసాలలో మెజారిటీ సాధించిన సంగెపు రంగారావును అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం సత్యనారాయణ, చావా ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్టీయూ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా కేక్ కట్ చేస్తున్న బోడె ప్రసాద్,.. బోడెతో వంగవీటి రాధాకృష్ణ

బోడెను అభినందించిన వంగవీటి రాధా

మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ నూతనంగా ఎన్నికైన పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌ను అభినందించారు. వంగవీటి రాధా నివాసంలో బోడె ప్రసాద్ ఆదివారం ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఈ మధ్య చోటు చేసుకొన్న రాజకీయ పరిణామాలను వారిద్దరూ చర్చించారు. బోడె వెంట కోయ ఆనంద్ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

రాజేంద్రప్రసాద్‌కు అభినందన

ఉయ్యూరు : ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం కూటమి అఖండ విజయం సాధించినందుకు పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్‌కు పలువురు అభినందనలు తెలిపారు. చిత్తూరు జిల్లాకు చెందిన పంచాయతీరాజ్ చాంబర్ నాయకుడు సుబ్బరామయ్య ఆధ్వర్యంలో చాంబర్ నాయకులు, వణుకూరు మాజీ సర్పంచ్ కాసరనేని మురళీ ఆధ్వర్యంలో పలువురు నాయకులు, ఉయ్యూరు పట్టణ మైనారిటీ యువత ఆదివారం రాజేంద్రప్రసాద్‌ను కలసి ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. మైనారిటీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అజ్మతుల్లా తదితరులు అభినందనలు తెలిపిన వారిలో ఉన్నారు.



వైవీబీని సత్కరిస్తున్న మైనార్టీ నాయకులు

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా..



ఈడుపుగల్లు బీసీ కాలనీలో విజయోత్సవం

ఈడుపుగల్లు (కంకిపాడు) : ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పని చేస్తామని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. మండలంలోని ఈడుపుగల్లు బీసీ కాలనీలో ఆదివారం ఏర్పాటు చేసిన విజయోత్సవ సభలో ఆయన సతీసమేతంగా పాల్గొన్నారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా బోడె ప్రసాద్ మాట్లాడుతూ, వైసీపీ పాలనలో ప్రజలు విసిగెత్తి పోయారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేవినేని రాజా, సర్పంచ్ పందిపాటి ఇందిర, ఉపసర్పంచ్ కిలారు శ్రీను, పార్టీ నాయకులు షేక్ షకార్, షేక్ మాబు సుబాని, పుట్టగుంట రవి, రావి సురేష్‌బాబు, సుధాకర్, చెల్లి సంగీతరావు, పీఆర్పీ వెంకటేశ్వరరావు, చిన్నబాబు, జోగి, నిరంజనరావు, పర్వతనేని రవి, శ్రీహరి, అనుమోలు రామకృష్ణ, సిద్దయ్య, నందమూరి మాధవ, రాయుడు, రఫి, కరీముల్లా, సలీం, చింటు, హరీఫ్, బాజి, కామేశ్వరరావు, తాజు, వెనిగళ్ల శ్రీనివాసు జనసేన పార్టీ నాయకులు గంధం కృష్ణారావు, సుబ్రహ్మణ్యం, రవి తదితరులు పాల్గొన్నారు.

● సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ ఘన విజయం సాధించటంతో న్యూ జెర్సీలోని ఈడుపుగల్లు గ్రామానికి చెందిన టీడీపీ సానుభూతిపరులు విజయోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్దు విజయ్, దేవినేని దమయంతి, కనకమేడల తేజ, కనకమేడల శంకర్ తదితరులు పాల్గొన్నారు.



న్యూ జెర్సీలో టీడీపీ విజయోత్సవం

రేషన్ డీలర్లకు పూర్వవైభవం

ఉయ్యూరు : సార్వత్రిక ఎన్నికల్లో పెనమలూరు అభ్యర్థిగా ఘనవిజయం సాధించిన బోడె ప్రసాద్ రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించి డీలర్లకు గత వైభవం తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్టు ఏపీ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కాగిత కొండ తెలిపారు. సంఘం నాయకులు, సభ్యులు బోడె ప్రసాద్‌ను పోరంకిలో ఆయన కార్యాలయంలో కలసి పుష్పగుచ్చాలు అందజేసి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రేషన్ డీలర్ల సమస్యలు ఆయన దృష్టికి తీసుకురాగా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. రెడ్డి రమణ. రాఘవేంద్రరావు, వీరప్ప, ఏసుబాబు, గఫూర్, శ్రీదేవి, రాజేశ్వరి, సుబ్బారావు తదితరులు బోడెప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	154, 163, 174
చికెన్ విత్ స్కిన్	300
చికెన్ స్కిన్‌లెస్	310
నెక్ కోడిగుడ్డు ధర	
విజయవాడ జోన్ రైతు ధర రూ.4.75	

కంటైనర్ ఢీకొని యువకుడు దుర్మరణం



మచిలీపట్నం టౌన్ : మచిలీపట్నంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. మచిలీపట్నం నుంచి చల్లపల్లి వెళ్లే బైపాస్ రోడ్డులో కంటైనర్ ఢీకొని గో సంఘం సమీపంలోని ఎస్సీ కాలనీకి చెందిన బాపట్ల బంగారయ్య (18) అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇనకుదురు ఎస్సై మగ్బుల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్రతిభాపురస్కారాలు అందుకున్న విద్యార్థులతో ఎస్సార్‌వైఎస్పీ జూనియర్ కళాశాల పూర్వవిద్యార్థులు

తల్లిదండ్రులు గర్వపడేలా విద్యార్థులు ఎదగాలి

● వరంగల్ జిల్లా సబ్ జైల్ అధికారి జి.విజయ్ దేని

● పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ప్రతిభావంతులకు ప్రోత్సాహకాలు

చల్లపల్లి, జూన్ 9 : ప్రతిభావంతులైన పేద విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను కొనసాగించి తల్లిదండ్రులు గర్వపడేలా ఉన్నత స్థానాలకు ఎదగాలని వరంగల్ జిల్లా సబ్‌జైల్ అధికారి జి.విజయ్ దేని అన్నారు. చల్లపల్లి సీఆర్ వికాస కేంద్రంలో ఎస్సార్‌వైఎస్పీ జూనియర్ కళాశాల పూర్వవిద్యార్థుల అసోసియేషన్ (1987-2020) ఆధ్వర్యంలో చల్లపల్లి, మోపిదేవి, ఘంటసాల మండలాల్లోని ప్రభుత్వ, ఎయిడెడ్, గురుకుల పాఠశాలల్లో పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేసి సన్మానించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న విజయ్ దేనీ (కళాశాల పూర్వ విద్యార్థి) మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ గురువులు, తల్లిదండ్రుల సూచనలు పాటించాలని కోరారు. అనేక ఇబ్బందులు ఎదుర్కొని తాను ఉన్నత స్థానానికి ఎదిగిన వైనాన్ని వివరించి విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపారు. ప్రభుత్వ కళాశాలల్లో కూడా కష్టపడి చదివితే ఉన్నత స్థానాలకు ఎదగవచ్చన్నారు. మరో ముఖ్య అతిథి, పూర్వవిద్యార్థి, విశ్రాంత సుబేదార్ మద్దిపట్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు దేశ సేవ చేయాల్సిన ఆవశ్యకతను వివరించారు. చదువులోనూ, జీవితంలోనూ స్నేహితుల పాత్ర కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో 46 మంది విద్యార్థినీ, విద్యార్థులను తల్లిదండ్రులతో కలిసి సత్కరించి రూ.80,500 బహుమతులను, జ్ఞాపికలను అందజేశారు. కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ టి.సాంబ శివరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ వేణు, అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జి.అశ్విన్‌కుమార్, బీడీఆర్, ప్రతినిధులు లంకె సుభాషిణి, వి.చారుమతి, ఎ.సాయికుమారి, అడ్డాడ ప్రసాద్‌బాబు, నడకుదురు లీలాబ్రహ్మేంద్ర, ఎండి ఎంకే.జిలానీ, వాసిరెడ్డి రాకేష్, మాలెంపాటి శ్రీనివాసరావు, వేములపల్లి అనిల్, చేతన్, బొందలపాటి నాగమల్లేశ్వరరావు, ఉప్పాల నాంచారయ్య, మోర్ల శివ, జన్ను నాంచారయ్య, కేతన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



గుడివాడలో కేక్ కట్ చేస్తున్న యలవర్తి తదితరులు



విన్నకోటలో జనసేన ఆధ్వర్యంలో...



చల్లపల్లిలో బీజేపీ నాయకుల సంబరాలు

బీజేపీ, జనసేన సంబరాలు

మచిలీపట్నం టౌన్, జూన్ 9 : భారత ప్రధానిగా మూడవ సారి నరేంద్ర మోదీ ఆదివారం ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా మచిలీపట్నంలోని బీజేపీ కార్యాలయం వద్ద బీజేపీ నాయకులు విజయోత్సవం నిర్వహించారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పుప్పాల రాము, పోతిరెడ్డి కృష్ణకాంత్, పెదశింగు శ్రీనివాస్, ధూళిపాళ శ్రీరామచంద్రమూర్తి, ఎన్. అయోధ్యరాము, వై.వి.ఆర్. పాండురంగారావు, గాయత్రి, తోట రంగనాథ్, గంటా సతీష్, మత్తి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. **చల్లపల్లి :** భారతదేశ ప్రధానమంత్రిగా నరేంద్ర మోడీ మూడవ సారి ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో చల్లపల్లి సెంటర్లో ఆదివారం సంబరాలు జరిగాయి. లక్ష్మీగణపతి దేవాలయంలో బీజేపీ, టీడీపీ, జనసేన నేతలు పూజలు నిర్వహించారు. మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు. టపాసులు పేల్చి సందడి చేశారు. పిండి రేవతి, తుంగల గిరి, బచ్చు విజయలక్ష్మి, మంచికంటి వెంకట సత్య కిరణ్, బడే శివ, సనకా ప్రశాంత్, వడుగు నాగబాబు, దుర్గారావు, మోర్ల రాంబాబు, ఫైడిపాముల స్వప్న, మోర్ల శివ, బోలెం నాగమణి, షేక్ నబీఫోరి, జనసేన నేతలు వేమూరి గోవర్ధన్, ఉరిమి మణికంఠ తదితరులు పెద్దఎత్తున పాల్గొన్నారు. **గుడివాడ :** దేశ ప్రధానిగా మూడోసారి నరేంద్ర మోదీ ప్రమాణస్వీకారం చేయడంతో ఆదివారం కూటమి నాయకులు సంబరాలు చేసుకున్నారు. నెహ్రూచౌక్ సెంటర్‌లో బీజేపీ నాయకులు దావులూరి సురేంద్ర ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చి, కేక్‌ను కట్ చేసి పంపిణీ చేశారు. కూటమి నాయకులు యలవర్తి శ్రీనివాసరావు, పిన్నమనేని పూర్ణవీరయ్య (బాబ్జీ), సూరే గాంధీ, దింట్యాల రాంబాబు, పల్లపోతు మురళీ, మూడెడ్ల శ్రీధర్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

జనసేన అన్నసమారాధన

గుడ్లవల్లేరు : జనసేన భారీ విజయం సాధించిన సందర్భంగా విన్నకోట గ్రామ యువత ఆదివారం రాత్రి విజయోత్సవం నిర్వహించారు. జనసేన జిల్లా పార్టీ కార్యదర్శి పేర్ని జగన్ ఆధ్వర్యంలో గ్రామంలోని జనసైనికులు కేక్ కట్‌చేశారు. అనంతరం రెండు వేల మందికి అన్న సమారాధన నిర్వహించారు. జనసేన జిల్లా పార్టీ కార్యదర్శి పేర్ని జగన్, మండల జనసేన పార్టీ కన్వీనర్ తోట చిన్నారి, చిలంకుర్తి వెంకటేష్, మాదాసు శ్రీను, సారథి, తులసి, జనసైనికులు, టీడీపీ నాయకులు హాజరయ్యారు.



ఆర్యవైశ్య యువజన సంఘం నూతన కార్యవర్గం

చల్లపల్లి : చల్లపల్లి ఆర్యవైశ్య యువజన సంఘం 51వ వార్షికోత్సవం ఆదివారం జరిగింది. యువజన సంఘ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తమ్మన సత్య వెంకట సాంబశివరావు, ప్రధాన కార్యదర్శిగా దేసు శివకిషోర్, కోశాధికారిగా ఆలపాటి లోకేష్, ఉపాధ్యక్షునిగా విస్సంశెట్టి మారుతిరామ్, సహాయ కార్యదర్శిగా విస్సంశెట్టి రామహరీష్, కార్యవర్గ సభ్యులుగా జల్లూరి నరేంద్ర, ఉరిమి మెహర్ మణికాంత్, జూపూడి కిరణ్‌కుమార్, కాటేపల్లి మణికంఠ, కొల్లిపర చైతన్య, కొత్తమాసు కార్తీక్‌కుమార్, కూరపాటి రాజేంద్ర, పరిశె రాజేంద్రకుమార్, చిట్టా రవికుమార్, కాకొల్లు శివప్రసాద్ ఎన్నికయ్యారు. ఎన్నికల కార్యక్రమాన్ని వరదా తాండవ కృష్ణ, కొల్లిపర మధు పర్యవేక్షించారు. ఆర్యవైశ్య సంఘం పెద్దలు అన్నవరపు పాండు రంగారావు, జల్లూరి ప్రసాద్, వరదా హరిగోపాల్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం లారీ ఆపి డబ్బు వసూలు

● నకిలీ విలేకరులపై చర్య తీసుకోవాలని పాత్రికేయుల ఫిర్యాదు

బంటుమిల్లి : రేషన్ బియ్యం లారీని ఆపి డ్రైవర్‌ను బెదిరించి డబ్బు వసూలు చేసిన నకిలీ విలేకరులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల పాత్రికేయులు ఆదివారం బంటుమిల్లి పోలీసులకు వినతిపత్రం అందజేశారు. కొంత మంది నకిలీ విలేకరులు కార్లు, బైకులపై ప్రెస్ స్టిక్కర్లు అంటించుకుని అక్రమంగా డబ్బు వసూళ్లకు పాల్పడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆదివారం తెల్లవారు ఝామున ఏడుగురు వ్యక్తులు రెండు కార్లలో వచ్చి రేషన్ బియ్యం లారీని ఆపి డ్రైవర్‌ను బెదిరించి రూ. 10 వేలు తీసుకున్నట్లు తెలిసిందన్నారు. లారీ డ్రైవర్ నకిలీ విలేకరులలో ఒకరికి ఫోన్ పే ద్వారా నగదు ఇచ్చాడు. బియ్యం లారీ యజమాని పోలీస్ స్టేషన్లో తనను బెదిరించి, డ్రైవర్‌ను ఇబ్బందులకు గురి చేసినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివిధ ప్రాంతాలకు చెందిన కొంతమంది ఒక ముఠాగా విలేకరులత పేర్లతో దుశ్చర్యలకు పాల్పడున్నారని పేర్కొంటూ పాత్రికేయులు ఫిర్యాదు చేశారు.

డీసీఎంఎస్ డైరెక్టర్ పదవికి రేమాల రాజీనామా

నాగాయలంక : వైసీపీ సీనియర్ నేత, డీసీఎంఎస్ డైరెక్టర్ రేమాల సుబ్బారావు (బెనర్జీ) వైసీపీ ఓటమి పాలవ్వటంతో తన పదవికి రాజీనామా చేశారు. ఆ లేఖను కృష్ణా జిల్లా మేనేజర్ యుడివి.ప్రసాద్‌కి పంపినట్లు ఆయన తెలిపారు.



గుబ్బల మంగమ్మ మొక్కు చెల్లించుకున్న టీడీపీ నాయకులు

పెడన రూరల్ : పెడన నియోజకవర్గ కూటమి అభ్యర్థిగా కాగిత కృష్ణప్రసాద్ విజయాన్ని పురస్కరించుకుని పెడన మండల టీడీపీ శ్రేణులు పశ్చిమ గోదావరి జిల్లా గుబ్బలమంగమ్మ ఆలయంలో మొక్కులు తీర్చుకున్నారు. మండల యువత అధ్యక్షుడు కట్టా సతీష్, నందిగం సర్పంచి బొడ్డు చినబాబు (సీతయ్య), కాకర్లమూడి గ్రామ పార్టీ అధ్యక్షుడు పరసా కామేశ్వరరావు, సొంటి రాము, స్వామి తదితరులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రామేశ్వరస్వామి వసంతోత్సవం

మోపిదేవి : టేకుపల్లిలో కంచికామకోటిపీఠం ఆధ్వర్యంలోని బాలపార్వతీ సమేత రామేశ్వర స్వామి కల్యాణ మహోత్సవంలో భాగంగా వసంతోత్సవం వైభవంగా నిర్వహించారు. సుప్రభాత సేవ, ప్రాతాహ్కాలార్చన, నీరాజనమంత్ర పుష్పాలు శాస్త్రోక్తంగా జరిపారు. నూతన ధాన్యం దంచి, రంగులు చల్లుకుని వసంతోత్సవం, అవభృద స్నానోత్సవం సంప్రదాయ బద్ధంగా జరిపారు. వేదపండితులు వేదమంత్రోచ్చరణ నడుమ పూర్ణాహుతి పూర్తి గావించారు. ఆలయ కమిటీ కార్యదర్శి యడవల్లి నీలాలోహిత శర్మ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పర్యవేక్షించారు.



ఫాదర్ సురేష్ గురుపట్టాభిషేకం

● విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

అవనిగడ్డ : కోటగిరిలంక లోని ఆర్‌సీఎం చర్చి విచారణ గురువు జి.సురేష్ మెర్లో గురు పట్టాభి మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఫాదర్ సురేష్ మెర్లో ఫాదర్ అయ్యి 20 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా స్థానిక చర్చి ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన కేక్ కట్ చేసి విశ్వాసులకు అందించారు. అనంతరం ఫాదర్ లూయిస్ రాజు, ఫాదర్ జాన్ ఫాదర్ సురేష్‌ని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేసి విశ్వాసులకు దివ్య సత్ప్రసాదాన్ని అందించారు. అనంతరం 200 మంది పేద విద్యార్థులకు పలకలు, నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కోటగిరిలంక సంఘ పెద్దలు, పలు గ్రామాల నుంచి విచ్చేసిన సంఘస్థులు పాల్గొన్నారు.

రెడ్లెంకమ్మకు ప్రత్యేక పూజలు

అవనిగడ్డ రూరల్ : అవనిగడ్డ శివారు తొమ్మిదో వార్డులోని కొత్త ఎడ్లంకలో పద్మశాలి బట్టు వారి కుల దైవం రెడ్లెంకమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. గాజులతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.



పేద కళాకారులకు ఆర్థిక సాయం

గుడివాడ : టీడీపీ ఘనవిజయం సాధించిన నేపథ్యంలో ఉపాధ్యాయులు శీరం శ్రీనివాసరావు వితరణతో పేద కళాకారులకు రూ.1000 చొప్పున ఆర్థిక సహాయాన్ని కళాకారుల సంఘ కార్యాలయంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ యలవర్తి అందించారు. సంఘం గౌరవాధ్యక్షులు నెరుసు చింతయ్య ఆధ్వర్యంలో ఉపాధ్యాయుడు శ్రీనివాసరావును ఘనంగా సత్కరించారు. మాజీ కౌన్సిలర్లు వసంతవాడ దుర్గారావు, గోకరకొండ బలరాం, సంఘం అధ్యక్షులు కొడాలి రాజా, కార్యదర్శి గాజులనల్లి కొండయ్య, కోశాధికారి కోటేశ్వరీ, గౌరవాధ్యక్షులు పి.స్వామిదాసు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శైవ మహాపీఠం సెంట్రల్ కమిటీ ఎన్నిక 16న

మచిలీపట్నం టౌన్ : మచిలీపట్నం వివేకానంద మందిరంలో శైవమహాపీఠం సెంట్రల్ కమిటీ ఎన్నికల ప్రక్రియ 16వ తేదీ ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతాయని సెంట్రల్ కమిటీ ప్రతినిధులు లింగమూర్తి తెలిపారు. వివేకానంద మందిరంలో ఆదివారం జరిగిన సమావేశంలో మచిలీపట్నం సంఘ గౌరవాధ్యక్షుడు సింగరాజు గోవర్ధన్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రక్రియపై సమీక్షించారు. మచిలీపట్నం శాఖ అధ్యక్షుడు మల్లంపల్లి నాగలింగ శాస్త్రి, కార్యదర్శి రవికుమార్,తాడికొండ శశిభూషణ్, పండితారాజ్యుల భద్రి, ములుగు పవన్‌కుమార్ తదితరులు మాట్లాడారు.

ఆంజనేయస్వామి ఆలయాల వద్ద అన్నదానం

మచిలీపట్నం టౌన్ : శివగంగ అంజనేయ స్వామి దేవాలయం వద్ద ఆదివారం భారీ ఎత్తున అన్నదానం జరిగింది. అన్నదానాన్ని ఎమ్మెల్యే కొల్లు రవీంద్ర తనయుడు కొల్లు పునీత్ ప్రారంభించారు. టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్, టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి, 30వ డివిజన్ ఇన్‌ఛార్జి పిప్పళ్ళ కాంతారావు, మునిసిపల్ మాజీ ఛైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, టీడీపీ నగర అధ్యక్షుడు ఎండి ఇలియాస్ పాషా, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మాజీ ఛైర్మన్ తలారి సోమశేఖర్, సనకా నాగులు తదితరులు పాల్గొన్నారు. **గుడివాడ :** అభయాంజనేయ స్వామి కృపాకటాక్షాలు గుడివాడ ప్రజలపై ఉండాలని మున్సిపల్ మాజీ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం నీలామహల్ రోడ్డులోని అభయాంజనేయస్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి సుబ్రహ్మణ్యం, వెంకటరమణల దంపతులు వితరణతో కమిటీ సభ్యులు సుంకర నాగార్జున, రత్నగిరి, పూజారి నండూరి రాంబాల ఆధ్వర్యంలో భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని యలవర్తి శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్లు నెరుసు చింతయ్య, గోకరకొండ బలరాంలు ప్రారంభించారు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వాసవీలో లాసెట్ ప్రశాంతం

పెడన రూరల్ : నందమూరు వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో లాసెట్ ఆదివారం ప్రశాంతంగా జరిగింది. ఉదయం జరిగిన పరీక్షకు 192 మంది విద్యార్థులకు 166 మంది హాజరయ్యారని నిర్వాహకులు పి. అశోక్ కుమార్ తెలిపారు.



విజయలక్ష్మికి ఘననివాళి

కూచిపూడి : రావూరి విజయలక్ష్మి ఆదర్శభావాలు స్ఫూర్తిదాయకమని వక్తలు పేర్కొన్నారు. విజయలక్ష్మి సంస్మరణ సభ పరిధిలోని చినముత్తేవి గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. పలువురు ప్రముఖులు మాట్లాడుతూ విజయలక్ష్మికుటుంబ సభ్యులందరూ కమ్యూనిస్టు పార్టీలో ఉంటూ వారు నమ్మిన సిద్ధాంతాల కోసం చివరి వరకు పోరాడిన గొప్ప వ్యక్తులని పేర్కొన్నారు. విజయలక్ష్మి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మహిళా సంఘ జిల్లా అధ్యక్షురాలు చేబ్రోలు బసవ పూర్ణ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.రఘు, ఉమామహేశ్వరరావు, ఉషారాణి, సాయి వరప్రసాద్, రాజారావు, రావూరి రమేష్‌బాబు, శీలం నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగురాలికి జనసేన సాయం

కోడూరు : సొంత వారు ఎవరూ లేక ఎటువంటి ఆదరణకు నోచుకోక ఇబ్బంది పడుతున్న నక్కవానిదారి గ్రామానికి చెందిన వికలాంగ వృద్ధురాలు నండూరి లక్ష్మీకి జనసేన పార్టీ నాయకులు చేయూతనందించారు. కోడూరు గ్రామానికి చెందిన జనసేన యువ నాయకుడు బచ్చు వెంకటేష్ ఆర్థిక సహకారంతో ఆదివారం నండూరి లక్ష్మీకి నిత్యావసర సరుకులు, కూరగాయలు, బియ్యం, కొంత నగదు అందించారు. నక్కవానిదారి గ్రామం జనసేన పార్టీ నాయకులు కోట సుబ్బారావు, జనసైనికులు బడే చంద్రకాంత్, నంద్యాల సాయి, యాదల సాయి కిరణ్, మేడ లక్ష్మణ్, మల్లి రాధాకృష్ణ, రియాజ్, తేజ, ఈశ్వర్, కోట మణికంఠ, నరసింహశెట్టి నందు, బొమ్మినేని గోపిచంద్, బడే జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

పోతురాజు స్వామి జాతర

నాగాయలంక : రేమాలవారిపాలెం శివారు పేర్లవాని లంకలో పోతురాజు స్వామి జాతర మహోత్సవాన్ని ఆదివారం భక్తులు ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు అనంతరం స్వామివారి శిలలను జల్దిలో ఉంచి ఆలయంలో ప్రతిష్ఠించారు. కొబ్బరికాయలు, పాల పొంగళ్లు, చద్ది నైవేద్యాలు సమర్పించి మొక్కుబడులను చెల్లించుకున్నారు. పేర్ల భీమేశ్వరరావు, పేర్ల శివరామప్రసాద్, పేర్ల శ్రీహరి, పేర్ల నాగేశ్వరరావు, పోతురాజు స్వామివారి భక్త బృందం పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

మచిలీపట్నం టౌన్ : మచిలీపట్నం ఈడేపల్లి శాఖా గ్రంథాలయంలో ఆదివారం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు కాగిత సాంబశివరావు, గ్రంథాలయాధికారి కోన వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితుడికి ఆర్థిక సాయం

మోపిదేవి : ప్రశాంత నగర్‌కు చెందిన కాకర్లమూడి రాజేష్ రెండు కిడ్నీలు పాడై ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతుండడంతో మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు దేవా గోవర్ధన్ రూ.10 వేల ఆర్థిక సాయమందించారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొంతు నరేష్, కె.సుధాకర్, బాపూజీ, నాగరాజు పాల్గొన్నారు.